క్లుప్తంగా

నేడు 'సంత' జరిగే ప్రాంతాలు ఇవే.....

గచ్చిబౌలి: వారాంతపు సంత నిర్వహణలో భాగంగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఆదివారం తారానగర్, గుల్‌మోహర్‌పార్కు కాలనీ,నానక్‌రాంగూడ, మదీనాగూడ, గోకుల్‌ప్లాట్స్ పెద్ద చర్చి వద్ద నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహించే ఈ సంతలలో సరసమైన ధరలకు తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, నిత్యావసరాలు, దుస్తులు, ఇతర వస్తువులు లభిస్తాయి.

నేడు 'పాలపిట్ట సైక్లింగ్ రైడ్'

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని పాలపిట్టపార్కులో హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ (హెచ్‌బీసీ), తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, స్మార్ట్ బైక్, వరల్డ్ సైక్లింగ్ అలయన్స్,బ్రుసెల్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'పాలపిట్ట సైక్లింగ్ రైడ్-2023' పే ఆదివారం నిర్వహిస్తారు. ఉదయం 7.15 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, అతిథులుగా బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్‌వైన్ ఓవెన్, టీఎస్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొంటారు.

సండే ఈవినింగ్ టాక్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సాగే ఈ కార్యక్రమంలో 'ఆర్ట్ ఆఫ్ విన్నింగ్' అనే అంశం పై హైదరాబాద్‌కు చెందిన సీనియర్ రాజయోగ టీచర్, మోటివేషనల్ స్పీకర్ బి.కె. మాధవి ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 12 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 15మందికి నిర్వహించినట్లు తెలిపారు.

వన్యప్రాణుల రక్షణకు చేయూత.. దరఖాస్తుల ఆహ్వానం..

సాక్షి, సిటీబ్యూరో: సహజ సిద్ధమైన పరిసరాలు, స్వదేశీ జాతుల రక్షణ కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ హాబీటట్స్ ట్రస్ట్ తమ వార్షిక హాబిటట్స్ ట్రస్ట్ గ్రాంట్స్ కోసం నగరానికి చెందిన వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. అంతరించే దశలో ఉన్న వన్యప్రాణులతో పాటు సహజమైన పరిసరాల పరిరక్షణ కోసం కృషి చేస్తోన్న సంస్థలు, వ్యక్తుల ప్రయత్నాలను ప్రోత్సహించేందుకు ఈ గ్రాంట్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. వచ్చే నెల 5వ తేదీలోగా పంపాల్సిన ఈ దరఖాస్తులకు అర్హత తదితర విషయాల గురించి https:// www.thehabitatstrust.org వెబ్‌సైట్‌ను సందర్శించాల్సిందిగా కోరారు.

నేడు ఓటరు జాబితాపై సమావేశం

పటాన్‌చెరు: ఈ నెల 7వ తేదీన పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేసే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పరమేశం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి పటాన్‌చెరులోని వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు, రాజకీయ పార్టీలు నాయకులు సకాలంలో హాజరై సహకరించాలని తహసీల్దార్ కోరారు.

డా. జానీ వర్గీస్‌కు పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇటీవలే పీహెచ్‌డీ పూర్తి చేసిన డాక్టర్ జానీ వర్గీస్‌కు ప్రతిష్ఠాత్మక పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ లభించింది. హెచ్‌సీయూలోని మెటీరియల్ ఇంజనీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన డాక్టర్ జానీ హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ(ఎస్ఈఎస్‌టీ) ప్రొఫెసర్ కోటేశ్వరరావు ,రాజులపాటి పర్యవేక్షణలో ఇటీవలే పీహెచ్‌డీ పూర్తి చేశారు. డాక్టర్ జానీ వర్గీస్ ప్రతిష్ఠాత్మకమైన 'స్టార్' సెన్సింగ్‌కి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమం కింద డాక్టర్ వర్గీస్ యూనివర్సిటీ ఆఫ్ సీజెన్ ప్రొఫెసర్ రాబర్ట్ బ్రాండ్ట్ ఆధ్వర్యంలో స్వతంత్ర పరిశోధన చేస్తారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నాగార్జున హోమ్స్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు.పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు.

'మనబస్తీ-మనబడి'తో అభివృద్ధి



జెడ్పీహెచ్ఎస్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు

- శేరిలింగంపల్లిలో 31 పాఠశాలల్లో మౌలిక వసతులు
- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాయదుర్గం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి 'మనబస్తీ-మనబడి' ప్రత్యేక కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెల్లడించారు. గచ్చిబౌలి డివిజన్‌లో మొత్తం రూ.1.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనుల్లో భాగంగా.. రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.04 కోట్ల వ్యయంతో, మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో రూ.46 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు ఆయన శనివారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబాతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మొదటివిడత కింద మొత్తం 31 ప్రభుత్వ పాఠశాలలుండగా శేరిలింగంపల్లి మండలంలో 24 పాఠశాలలు, కూకట్‌పల్లిలో ఏడు ప్రభుత్వ పాఠశాలలకు ఈ అవకాశాన్ని కల్పించామన్నారు. ముఖ్యంగా అదనపు తరగతి గదులు, క్లాస్‌రూమ్‌లో డ్యూయల్ డెస్కులు, విద్యుత్, టాయిలెట్లు, మంచినీరు, వంటగదులు, భోజనశాలలు, వాకింగ్ ట్రాక్‌లు, ప్రహరీ ఇలా అనేక సకల సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీఎస్ఈడబ్ల్యూడీసీ ఏఈ శ్యామ్, హెచ్ఎం తాజ్‌బాబు, నాయకులు రాజునాయక్, చెన్నంరాజు, సత్యనారాయణ, సంపత్, రమేష గౌడ్, కృష్ణయాదవ్, శ్యామ్‌యాదవ్, సతీష్ యాద గిరి, సలావుద్దీన్, విద్యా కమిటీ సభ్యులు కృష్ణగౌడ్, సురేష్, నరేందర్, దేవేందర్, నరేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



భరతనాట్య ప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం తమిళనాడు రాష్ట్రానికి చెందిన నటన సంగమం నాట్య గురువు వలమర్తి పురుషోత్తం శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ఇందులో పుష్పాంజలి, నర్తన గణపతిం, అలరిపు, వర్ణం, చంద్రచూడరేయ్, జయజయ జగదీశ్వరీ, తిల్లాన, మంగళం తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు కార్తీక నటరాజన్, వినీత, యువరాణి పాల్గొన్నారు.

మెడికవర్‌లో చేతుల పరిశుభ్రత దినోత్సవం



మాదాపూర్: తరచూ చేతులను శుభ్రం చేసుకోవడం వల్ల 80శాతం రోగాలు రావని క్రిటికల్ కేర్ హెడ్ డాక్టర్ ఘన్‌శ్యామ్ జగత్కర్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో శనివారం చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వంద మందిలో 10 మందికి వచ్చే అంటు వ్యాధులు చేతులు శుభ్రంగా లేకపోవడం వల్లనే అన్నారు. చేతులు శుభ్రంగా చేకపోవడం వల్ల డయేరియా, హెపటైటిస్, జలుబు, టైఫాయిడ్, పచ్చకామెర్లు, కళ్ళ కలకలు, దగ్గు, న్యూమోనియా, మెదడు వ్యాపు, చర్మవ్యాధులు వంటి వివిధ రకాల రోగాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. సబ్బు, హ్యాండ్‌వాష్, శానిటైజర్‌లతో కనీసం 20 సెకన్ల పాటు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఆహారం తినేముందు, తిన్నతరువాత చేతులు శుభ్రం చేసుకోవడం పిల్లలకు అలవాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నందన జాస్తి, డాక్టర్ కృష్ణకిరణ్, డాక్టర్ చంద్రశేఖర్ దానన, డాక్టర్ హరిత మదిగుబ్బ, డాక్టర్ కిషన్‌నాగ్, సెంటర్ హెడ్ మాతప్రసాద్, ఆపరేషన్ హెడ్ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు పోటీ

సాక్షి, సిటీబ్యూరో: ఔత్సాహిక, వర్ధమాన, విద్యార్థి ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్‌ల ప్రతిభను ప్రోత్సహించేందుకు డిజిటల్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కాంటెస్ట్ నిర్వహిస్తున్నట్టు నికాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండి సజ్జన్ కుమార్ తెలిపారు. ఈ నెల 29 నుంచి 'షటర్ బగ్' పేరిట నిర్వహించే ఈ పోటీలో 15-35 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు పాల్గొనవచ్చునని తమ ఎంట్రీలను https:// www.capturewithnikon.in/shutterbug& s3 లో గాని, హ్యాష్‌ట్యాగ్‌తో ఫొటోగ్రాఫ్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా పంపవచ్చునన్నారు.

మహిళతో అసభ్యకర ప్రవర్తన.. వ్యక్తి రిమాండ్

మియాపూర్: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఎస్ఐ రాఘవేందర్ తెలిపిన ప్రకారం.. హఫీజ్‌పేట్‌లో శనివారం ఓ వ్యక్తి మహిళతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని మియాపూర్ పోలీసులకు సమాచారమందించగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అతన్ని ఆపే ప్రయత్నం చేయగా దుర్భాషలాడుతూ వారిపై తిరగబడ్డాడు. దీంతో మియాపూర్ పోలీసులు హర్బాన్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, వెలిమెల గ్రామంలో 40 ఏళ్లుగా ఉన్న భూసమస్యను పరిష్కరించిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం వెలిమెలలో సర్వే నంబర్ 434లో 57 మంది లబ్ధిదారులకు పట్టా పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో రూ.1.63కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం భూసమస్యను పరిష్కరించిందని కొనియాడారు. అనంతరం రూ.9కోట్లతో వార్డుల అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వెన్నవరం భూపాల్ రెడ్డితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత, వైస్ చైర్మన్ రాములుగౌడ్, తహసీల్దార్ జయరాం, కౌన్సిలర్‌లు రవీందర్ రెడ్డి, సుచరిత, లచ్చిరాం నాయక్, బాలాజీ, శంషాబాద్ రాజు, మాజీ సర్పంచ్ విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెల్లి పెళ్లి అప్పు తీర్చేందుకు చోరీ



సమావేశంలో మాట్లాడుతున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చెల్లి పెళ్లికి చేసిన అప్పులు తీర్చేందుకు ఓ కార్పెంటర్ చోరీకి పాల్పడి పోలీసులకు అడ్డంగా దొరికాడు. ఆ వివరాలను విలేకరులకు శనివారం మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి వెల్లడించారు. రామచంద్రాపురం పట్టణంలోని ఎస్‌బీఎస్‌బీ అవతార్‌లో నివాసం ఉండే విష్ణుతేజ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కాగా గత నెల 26వతేదీన కుటుంబ సభ్యులతో కలిసి సంగారెడ్డి వెళ్లాడు. ఈ నెల 1వ తేదీ రాత్రి ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఇంటి కిటికీ గ్రిల్ తీసి ఉండడాన్ని గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా పడక గది తాళం పగులగొట్టి ఉంది. అందులో రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, 2 విలువైన చేతి గడియారాలు, రూ.15వేలు నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రతాపలింగం, ఎస్ఐ నర్సింహులు వారి బృందంతో విచారణ మొదలు పెట్టారు. చోరీ చేసిన తీరును పరిశీలించి కార్పెంటర్ అయి ఉండవచ్చని అనుమానించారు. ఆ అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కార్పెంటర్‌ల వివరాల సేకరించారు. బాధితుడి పక్క ప్లాట్‌లో పనిచేస్తున్న హైదరాబాద్‌లోని కాప్రాలో నివాసం ఉండే బిహార్‌కు చెందిన కార్పెంటర్ రాకేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. తన చెల్లి పెళ్లి కోసం చేసిన అప్పులు తీర్చడం కోసం ఈ చోరీ చేసినట్లు చెప్పాడు. అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలు, చేతి గడియారాలు, రూ.13,700 నగదు, ఒక డ్రిల్లింగ్ మెషిన్ స్వాధీనం చేసుకున్నారు. త్వరగా కేసు ఛేదించిన అధికారులను ఆమె అభినందించారు. క్రైం సిబ్బంది గోపీకృష్ణారెడ్డి, నారాయణ, ప్రకాష్, మహేందర్, సిద్ధులకు రివార్డులు అందించారు.

నియోజకవర్గ భూ సమస్యలను పరిష్కరించండి

భూ పరిపాలనా కమిషనర్ నవీన్ మిట్టల్‌ను కలిసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయించిన రెండు ఎకరాల స్థలంలో భవన నిర్మాణానికిగాను నిధుల మంజూరుకు మంత్రి కేటీరామారావు సానుకూలంగా ఉన్నందున రూ.9 కోట్ల నిధులు మంజూరుకు సహకరించాలన్నారు.శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం సచివాలయంలో రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి, భూ పరిపాలనా కమిషనర్ నవీన్ మిట్టల్‌ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూకట్‌పల్లి డివిజన్‌లోని పాపిరెడ్డినగర్‌లో 59 జీఓ ద్వారా క్రమబద్ధీకరణ చేసుకునే వారు అధిక మొత్తం చెల్లించాల్సిందిగా రెవెన్యూ అధికారులు చెప్పారని, ఏ బ్లాక్ కన్నా బీ, సీ బ్లాక్ వాసులు అధిక మొత్తంలో చెల్లించాల్సి రావటంతో ఆ వ్యత్యాసాన్ని పరిశీలించాలని కోరారు. అదేవిధంగా హైదర్‌నగర్ డివిజన్ రామ్‌నరేష్ నగర్ కాలనీ వాసులు వారి ఆస్తులపై రిజిస్ట్రేషన్ శాఖ తెలుపుతున్న అభ్యంతరాలను పరిష్కరించాలని, నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో యుఎల్‌సి ద్వారా డబ్బులు చెల్లించినా వారి స్థలాలను క్రమబద్ధీకరించకపోవడం, జీఓ 58, 59ల ద్వారా దరఖాస్తు చేసుకున్న పేదల ఆస్తుల క్రమబద్ధీకరణను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన నవీన్ మిట్టల్ తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

పార్ట్‌టైం జాబ్ ఆఫర్ ఉందంటూ...

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ ఆఫర్ ఉందంటూ ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగులను సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. టాస్కుల పేరిట ఆ ఇద్దరి నుంచి రూ.2.79 లక్షలు లాగేశారు. చివరకు డబ్బు ప్రస్తావన వచ్చేసరికి వారి నుంచి రెస్పాన్స్ లేదు. దీంతో తాము మోసపోయామంటూ ఆ ప్రైవేట్ ఉద్యోగులు సైబర్ క్రైమ్ పోలీసులతోపాటు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు.

- బీరంగూడకు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి ఏప్రిల్ 27వ తేదీన పార్ట్ టైం జాబ్‌ఆఫర్ అంటూ ఓ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలు నమోదు చేసి నగదు పెడుతూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తూ వస్తున్నాడు. చివరికి తాను పెట్టిన రూ1.50లక్షలకు రెట్టింపు నగదు ఇవ్వాలని అడగ్గా, అవతలి వ్యక్తి నుంచి స్పందన రాలేదు.
- అమీన్‌పూర్‌కు చెందిన మరో ఉద్యోగికి ఏప్రిల్ 3వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం పేరిట ఓ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తాను వివరాలను నమోదు చేసి అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నగదు పెడుతూ, టాస్కులు చేస్తూ వచ్చాడు. చివరకు తాను పెట్టిన రూ.1.29 లక్షలకు రెట్టింపు ఇవ్వాలని అడగ్గా అవతలి నుంచి స్పందన లేదు.

సొంతూరికి వెళుతున్నానని...

పటాన్‌చెరు టౌన్: స్వగ్రామానికి వెళుతున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. అమీన్‌పూర్ ఎస్ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని కర్నూలుకు చెందిన నాగేశ్వరరావు బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ పరిధిలోని భవానీపురం కాలనీకి వచ్చాడు. స్థానికంగా సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏప్రిల్ 30వ తేదీన బైక్‌పై కర్నూలు వెళ్లి వస్తానని చెప్పి బయలుదేరిన నాగేశ్వరరావు ఆచూకీ తెలియలేదు. ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ వచ్చింది. కర్నూలులో వెతికినా వివరాలు తెలియలేదు. దీంతో తన తండ్రి కనిపించడం లేదంటూ నాగేశ్వరరావు కుమారుడు సతీష్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి అదృశ్యంపై కుమారుడు ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: తండ్రి అదృశ్యంపై ఓ కుమారుడు ఫిర్యాదు చేశాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం..మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన నర్సింలు కుటుంబసభ్యులతో కలిసి మూడు నెలల క్రితం బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి వచ్చి కూలి పనులు చేస్తూ సాగిస్తున్నారు. ఈనెల 3వ తేదీన నర్సింలు కుటుంబసభ్యులతో కలిసి పనికి వెళ్లగా, ఇంటి వద్ద ఉన్న తండ్రి పాపన్న బయటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తండ్రి కనిపించలేదు. తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. తన తండ్రికి కల్లు తాగే అలవాటు ఉందని, బయటకు వెళ్లి ఇల్లు తెలియక తిరిగి రాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భర్తతో గొడవపడి..



మంజుల మృతదేహం

పటాన్‌చెరు టౌన్: భర్తతో గొడవపడి ఓ భార్య ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పటాన్‌చెరు ఎస్ఐ ప్రసాదరావు కథనం ప్రకారం...కంది మండలానికి చెందిన మంజుల(35) వివాహం 2006లో పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన రాములుతో జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరునెలల నుంచి మంజుల కంది సమీపంలోని ఒక ప్రైవేట్ క్యాంటీన్‌లో ఉద్యోగం చేస్తూ, మద్యానికి బానిస అయ్యింది. ఈ క్రమంలో మే 5వతేదీన మంజుల తాగి వచ్చి ఇంట్లో పిల్లలను కొడుతుతుండగా, భర్త మందలించాడు. దీంతో మద్యం మత్తులోనే భర్తతో గొడవపడి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి మంజుల చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. భర్త రాములు స్థానికుల సహకారంతో తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లి భార్యను చికిత్స నిమిత్తం ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆపై పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో మాయం

పటాన్‌చెరుటౌన్: ఇంటి ఎదుట పార్కు చేసిన ఆటో చోరీ అయ్యింది. పటాన్‌చెరు ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం...పట్టణంలోని గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన రాజు తన ఆటోను ఏప్రిల్ 30వ తేదీన ఇంటి ముందు పార్కు చేశాడు. మే 1వ తేదీ ఉదయం 6 గంటలకు నిద్రలేచి చూడగా ఆటో కనిపించలేదు. దీంతో ఆటో కోసం పటాన్‌చెరు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆటోను దొంగలు ఎత్తుకెళ్లారంటూ రాజు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగ జంగ్‌సైరన్ సభను విజయవంతం చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఈనెల 8వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిరుద్యోగ జంగ్‌సైరన్ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి అనిల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై, పేపర్ లీకులకు నిరసనగా నిరుద్యోగ జంగ్ సైరన్ సభను సరూర్ నగర్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న సభకు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు ప్రియాంకగాంధీ హాజరుకానున్నట్లు తెలిపారు.

తలసేమియా రోగులకు అండగా..

మాదాపూర్: తలసేమియా రోగులకు క్రమం తప్పకుండా రక్తమార్పిడి అవసరముంటుందని తలసేమియా సైకిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్) సీఈఓ డాక్టర్ సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం బీహెచ్ఎల్, మాదాపూర్ తదితర ప్రాంతాలలో రక్తదాన శిబిరాలను నిర్వహించి 500 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అబుఐమల్, జాయింట్ సెక్రటరీ అలీమ్‌బేగ్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ బొంబాయికాలనీలో ఓ నిరుపేద కుటుంబంలో జరుగుతున్న శుభకార్యానికి బీఆర్ఎస్ నాయకులు, ఏకే ఫౌండేషన్ చైర్మన్ షేక్ అబ్దుల్‌ఖదీర్ శనివారం నిత్యావసర సరుకులను అందజేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మియాపూర్: దీప్తిశ్రీనగర్‌లోని ధర్మపురి క్షేత్రంలో శ్రీ అష్ట భైరవ సహిత జ్యోతిర్మయి ఆత్మలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో హోమాలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చుట్టుపక్కల కాలనీలవాసులు పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పబ్లిక్ కాంటాక్ట్‌లో సమస్యల పరిష్కారం

భాగ్యనగర్‌కాలనీ: ప్రతి సమస్యనూ పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవచ్చని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని శంషీగూడ, ఇంద్రాహిల్స్, ఆదర్శ్‌నగర్, సాయిచరణ్‌కాలనీ, పీవీఆర్ సాయి హిల్స్‌లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కాలనీ, బస్తీ వారు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అభివృద్ధే లక్ష్యమని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో రూ.50లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎడతెరిపిలేకుండా కురుస్తున్న అకాల వర్షాలకు కాలనీలోకి వరద వస్తుండటంతో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బబురుగడ్డ నగేష్, విఠల్, సత్యనారాయణ, సింగ్, బలరాం పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి హోమం, శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం, తీర్థ ప్రసాద గోష్ఠి, పండిత సత్కారం నిర్వహించారు.

యువత శాస్త్రీయ దృక్పథంతో సాగాలి



మాట్లాడుతున్న విజ్ఞానదర్శిని రాష్ట్ర కన్వీనర్ రమేష్

మియాపూర్: స్వాతంత్ర్య ఉద్యమంలో యువత పాత్ర గొప్పదని విజ్ఞాన దర్శిని రాష్ట్ర కన్వీనర్ రమేష్ పేర్కొన్నారు. మియాపూర్‌లోని ఎంఏనగర్‌లోని కార్యాలయంలో రెండవ రోజు ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర స్థాయి రాజకీయ విజ్ఞాన తరగతులు శనివారం జరిగాయి. ఈ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై యువతకు రాజకీయ విజ్ఞానంపై అవగాహన కల్పించారు. నేటి యువత నాటి వాస్తవ చరిత్రను నిలబెడుతూ శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్, రమేష్, వనం సుధాకర్, తుకారాం నాయక్, గోపీ, రవి, పల్లె మురళీ, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు సుల్తానా, దశరథ్ నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీనగర్ సమస్యలు పరిష్కరించాలని వినతి

శేరిలింగంపల్లి: నేతాజీనగర్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం బృందం జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. శనివారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఈఈ శ్రీనివాస్‌ను కాలనీ అధ్యక్షులు భేరి రాంచందర్‌యాదవ్, ఉపాధ్యక్షుడు ఎండి కమ్మర్‌పాషా, ప్రతినిధులు నర్సింహ్మయాదవ్, సభ్యులు కలిశారు. ముఖ్యంగా ఔట్‌లెట్ లేక మురుగు సమస్యతో అవస్థల పాలవుతున్నారని, సీసీరోడ్లు, మౌలిక వసతులు కల్పించాలని వారు కోరారు. ఇందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.